
సాక్షి నిజామాబాద్

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



ఆ బాధ్యత మాకొద్దు..

ఎస్సారెస్పీలోని చేపపిల్లల ఉత్పత్తి కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు అధికారులు ముందుకు రావట్లేదు.

- 8లో ▸



ప్రజా సంక్షేమానికి కృషి

ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.7 /24.6

ఉదయం ప్రకాశవంతంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'సంక్షేమ నిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్ : 2023–2024లో జిల్లాలోని అనాథ పిల్లలు, వృద్ధాశ్రమాలు, కుష్ఠు, క్షయ వ్యాధి రోగులకు పునరావాసం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు సంక్షేమ నిధి కోసం దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి శశికళ తెలిపారు. సెప్టెంబర్ 30 తేదీ లోగా దరఖాస్తులు తమ కార్యాలయంలో అందాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి నియమనిబంధనల ప్రకారం నిధులను అందజేస్తామన్నారు. జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, రూం. నెం 102లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్ : నాగారంలోని గిరిజన గురుకుల మహిళా కళాశాలలో పార్ట్‌టైం ప్రాతిపదికన మహిళా అభ్యర్థుల నుంచి వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ సైదా జైనా ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో సబ్జెక్టులకు సంబంధించి తెలుగు, ఆంగ్లం, జువాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, పీడీ, ఎన్‌సీసీ కోసం ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీలో 55 శాతం ఉత్తీర్ణత, సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

కలెక్టరేట్‌లో పోలీసుల తనిఖీలు



సుభాష్‌నగర్ : బీజేపీ నాయకుల కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో ఆ ప్రాంతంలో పోలీసులు సోమవారం పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రధాన గేట్లు మూసేయడంతో ముట్టడి కార్యక్రమం ముగిసేంత వరకూ ఉద్యోగులు, ఫిర్యాదుదారులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఉద్యోగుల ఐడీ కార్డులు, ఫిర్యాదుదారుల టోకెన్లు ఉంటేనే పోలీసులు లోనికి అనుమతించారు. ఒక్కొక్కరిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోనికి పంపించారు. వరుసగా రెండు, మూడు ముట్టడి, ధర్నా కార్యక్రమాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. ప్రతి సోమవారం ఇదే తంతు కొనసాగుతుండటంతో వాహనదారులు, వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

మోపాల్ : నగర శివారులోని భూమారెడ్డి ఫంక్షన్‌హాల్ మంగళవారం ఉదయం 9 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఎమ్మెల్సీ కవిత చొరవతో జాబ్‌మేళాకు 35 కంపెనీలు హాజరుకానున్నాయి. 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యనభ్యసించిన అభ్యర్థులంతా జాబ్‌మేళాకు అర్హులు. జాబ్‌మేళాకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరుకానున్నారు. పక్కజిల్లాల యువత జాబ్‌మేళాను సక్సెస్ చేయాలని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ సోమవారం పేర్కొన్నారు.

సురక్షితమైన డ్రైవింగ్‌తో కుటుంబానికి భద్రత



కమ్మర్‌పల్లి : యువకులు సురక్షితమైన డ్రైవింగ్‌తో కుటుంబానికి ధీమా కల్పించాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ప్రారంభోత్సవం, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాల అందజేత కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. యువత కోసం డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించే కార్యక్రమం చేపట్టిన మంత్రిని అభినందించారు. వచ్చే రాఖీ సందర్భంగా సోదరులకు హెల్మెట్ గిఫ్ట్‌గా ఇవ్వాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు.

నేడు దిశ సమావేశం

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు సమీక్ష ప్రారంభమవుతుందన్నారు.

తెలుగుపై ప్రేమతో..



- తెలుగు భాషకు పూర్వవైభవం తెస్తున్నవారెందరో..
- తమ రచనలు, ప్రసంగాలతో యువతకు భాషపై అవగాహన



'మన సంస్కృతి, సంప్రదాయాలతో అనుసంధానం కావడానికి మాతృభాష చాలా శక్తివంతమైన మాధ్యమం. దేశంలో ఎంతో వైభవోపేతమైన భాష తెలుగు. అందుకే ఈనెల 29వ తేదీని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా తెలుగులో రచనలు చేసి.. ఉపాధ్యాయులుగా.. అధ్యాపకులుగా రాణిస్తూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న వారి వివరాలతో కూడిన కథనం..



తెయూ(డిచ్‌పల్లి) : పేదరికం వల్ల బాల్యంలోనే చదువుకు ఆటంకం కలిగినా, పత్తి కంపెనీలో కూలీగా పనిచేసినా ఆమె తన ఆత్మవిశ్వాసాన్ని వదులుకోలేదు. దూరవిద్య ద్వారా ఉన్నత విద్యనభ్యసించి అంచెలంచెలుగా ఎదిగి అత్యంత ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి పురస్కారం ''మహర్షి బాదరాయణ వ్యాస్ సమ్మాన్ – 2019'' కు ఎంపికయ్యారు. జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖలో 2007లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం పొంది అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా ప్రదోన్నతి సాధించారు. తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారు. ఆమెనే ప్రొఫెసర్ వంగరి త్రివేణి.

తెయూలో ఉన్నత పదవుల్లో..

25 ఏళ్ల బోధనానుభవంలో అనియత విద్యాబోధకురాలిగా, గ్రేడ్ -2, గ్రేడ్ -1 తెలుగు పండిట్ (స్కూల్ అసిస్టెంట్, తెలుగు) ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కూడా త్రివేణి పనిచేశారు. తెయూ తెలుగు అధ్యయనశాఖకు విభాగాధిపతిగా, పాఠ్యప్రణాళికా సంఘ చైర్మన్‌గా ప్రజాసంబంధాల అధికారిగా, సాంస్కృతిక కార్యక్రమాల కో–ఆర్డినేటర్‌గా, యువజన సంక్షేమ అధికారిగా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, గ్రంథాలయ నిర్వహణ అధికారిగా ఇలా పాలనాపరమైన పదవులు నిర్వర్తించారు.

40 పుస్తకాలు ప్రచురించి..

పుప్పొడి, పుత్తడి, బవంతి, బరంతి, పొత్తిలి, భాషిక, అలుగు, అరుగు, బటువు, భరిణ అనే వ్యాస సంపుటాలు, చిల్లరిగె స్వరాజ్యలక్ష్మి కవిత్వ పరిశీలన, ఇలా మొత్తం 40 పుస్తకాలు ప్రచురించారు.

పురస్కారాలెన్నో..

రాష్ట్రపతి యువ ప్రోత్సాహ పురస్కారానికి గాను రూ. లక్ష నగదు పారితోషికం అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేత ఉత్తమ అధ్యాపక పురస్కారం – 2018, 'పద్మరత్న' జీవన సాఫల్య పురస్కారం, 'పద్మకన్య' పురస్కారం, 'పద్మనారి' పురస్కారం, గాదేపల్లి వెంకటమ్మ వీరయ్య యువ సాహిత్య పురస్కారం, ప్రమీలా శక్తి విశిష్ట సాహిత్య పురస్కారాలతో పాటుగా దాదాపు 35 జాతీయ, రాష్ట్ర, ప్రాంతీయ స్థాయి అవార్డులు, ప్రశంసలు పొందారు. వివిధ సాహిత్య దిన,వార, మాస పత్రికల్లో దాదాపు 100 కు పైగా పరిశోధనా వ్యాసాలను ప్రచురించారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ, సాహిత్య సదస్సుల్లో దాదాపు 100కు పైగా పత్ర సమర్పణలు చేశారు. సాంస్కృతిక అధ్యయనం, తెలంగాణ సాంస్కృతిక వికాసం అనే అంశాలపై అంతర్జాతీయ సదస్సులు, గురజాడ, జాషువా సాహిత్యాలపై జాతీయ సదస్సులు, కథారచన కార్యశాల, ప్రపంచ తెలుగు మహాసభలు 2012, 2017 నిర్వహణలు, తదితర సమావేశాలు నిర్వహించారు. అమెరికాలో ఆటా, తానా సభల్లో, సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియాలో జరిగిన తెలుగు సదస్సుల్లో ప్రసంగాలు చేశారు.

బిరుదులు.. పురస్కారాలు



డొంకేశ్వర్(ఆర్మూర్) : ప్రభుత్వ ఉపాధ్యాయుని పేరు టీకుర్ల సాయిలుకు తెలుగంటే ఎంతో మక్కువ. 2012లో ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారు. ప్రస్తుతం డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాషా పండితులుగా పని చేస్తున్నారు. మాతృభాష తెలుగును విస్తరింపజేయడానికి తనవంతుగా కృషి చేస్తున్నారు. కొన్నేళ్లుగా 300 తెలుగు పద్యాలు రాయగా, సాయి అంతరంగ మదన శతకం, ఆత్మ పరిశీలన శతకం పుస్తకాలను కూడా రాశారు. వ్యాస సమీక్ష రచనలు, గజల్స్, తొణుకులు, నూతన సాహిత్య ప్రక్రియలో రామాయణంపై రచనలు కూడా చేశారు. ఇందుకు గుర్తింపుగా ఆయనకు కవిచక్ర, సాహితీ కిరీటి, తెలుగు శ్రీ లాంటి బిరుదులు పొందారు. రాష్ట్ర స్థాయిలో తెలుగు బెస్ట్ టీచర్ పుస్కారాన్ని, అలాగే పీవీ నరసింహారావు పురస్కారం–2022కు ఎంపికయ్యారు. విద్యార్థులు తెలుగు భాషను చక్కగా నేర్చుకునేందుకు తనదైన శైలిలో బోధనలు చేస్తూ సాయిలు ఆదర్శంగా నిలుస్తున్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే వృథానే..



చౌట్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- రైతు కష్టం తెలిసిన వ్యక్తి కేసీఆర్
- ఇప్పుడున్న పథకాలు వచ్చే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనూ కొనసాగుతాయి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కమ్మర్‌పల్లి : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటు వృథా అవుతుందని, మురికికాలువలో వేసినట్లేనని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి, నాగాపూర్ గ్రామాల్లో నిర్వహించిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి ఏ ఇంద్రకరణ్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. మూడు నెలల క్రితం కర్ణాటకలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేక బొక్కబోర్లా పడిందన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో హైదరాబాద్‌కు పెద్దపెద్ద కంపెనీలు వస్తున్నాయని, అవి కట్టే ట్యాక్స్‌లు ప్రజాసంక్షేమానికి ఉపయోగపడతాయన్నారు. రైతు కష్టం తెలిసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. చౌట్‌పల్లిని చూస్తే అభివృద్ధి ఎలాం ఉంటుందో తెలుస్తుందన్నారు. మనిషి మంచోడైతే సరిపోదని, పార్టీ కూడా మంచిగా ఉండాలని కాంగ్రెస్‌లో చేరిన సునీల్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్‌కు సీఎం అభ్యర్థి ఎవరో సునీల్ రెడ్డిని, బీజేపీ సీఎం అభ్యర్థి ఎవరో ఓట్లడిగేందుకు వచ్చే వారిని అడగాలన్నారు. పదేళ్లలో చౌట్‌పల్లికి రూ. 47 కోట్ల నిధులు వచ్చాయంటే అభివృద్ధిని అర్థం చేసుకోవాలన్నారు. బీడీ కార్మికుల భృతి కోసం సీఎం కేసీఆర్‌ను మోర్తాడ్ నుంచే ప్రశాంత్‌రెడ్డి తాను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. ఇప్పుడున్న పథకాలు వచ్చే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనూ ఉంటాయన్నారు.

ఆసరాతో వృద్ధులకు గౌరవం

ఆసరా పింఛన్‌తో వృద్ధులకు ఇంట్లో, సమాజంలో గౌరవం పెరిగిందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలతో మహారాష్ట్రలోని ప్రజలు తమను తెలంగాణాలో కలుపుకొమ్మని అడుగుతున్నారన్నారు. యాదాద్రి పుణ్యక్షేత్రానికి నిత్య 60–70 వేల మంది తరలివెళ్తున్నారంటే సీఎం కేసీఆర్ ఘనతే అని అన్నారు. రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ మతం పేరుతో నడిచే పార్టీని నమ్మవద్దన్నారు. నాయకులు రాజా రాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చౌట్‌పల్లిలో గజమాలతో ఎమ్మెల్సీ కవితకు సన్మానం

రైతు నాయకుడు సీఎం కేసీఆర్

రైతు తలెత్తుకొని బతకాలని తండ్రిలా పని చేస్తున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ మూలనా చూసిన ఎకరం భూమి ధర రూ. 25 లక్షలకు తక్కువ లేదని, దానికి కారణం సీఎం కేసీఆర్ రైతాంగం కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలేనన్నారు. రైతుబంధు పథకం కింద రూ. 72 వేల కోట్లు, రుణమాఫీ కింద రూ. 32 వేల కోట్లు రైతుల ఖాతాలో జమచేసిన ఘనత కేసీఆర్‌దే నని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో పింఛన్ రూ. 500కు మించలేదని, ఇక్కడ రూ. 4 వేలు ఇస్తామంటున్నారని నమ్మవద్దన్నారు. అబద్ధపు హామీ ఇచ్చిన అర్వింద్‌ను నమ్మవద్దన్నారు.

ఘనంగా అనాథ బాలిక వివాహం

- మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుభకార్యం
- వధూవరులను ఆశీర్వదించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న కామారెడ్డి కలెక్టర్

సదాశివనగర్: చిన్న వయసులోనే కన్నవారిని కోల్పోయిన బాలికను చేరదీసి, పెద్ద చేసిన మహిళా శిశు సంక్షేమ శాఖ.. ఆ బాలికకు ఓ కుటుంబాన్నీ అందించింది. అధికారులే పెళ్లి పెద్దలుగా మారి ఆమెను పెళ్లిపీటలు ఎక్కించారు. ఈ అపురూప సన్నివేశానికి ధర్మారావుపేటలోని రెడ్డి సంఘం ఫంక్షన్ హాల్ వేదికైంది. కామారెడ్డిలోని బాలసదనంలో పెరిగిన రూప, ధర్మారావుపేటకు చెందిన కారంగుల అనిల్‌ల వివాహం సోమవారం ఘనంగా జరిగింది. 'మహిళా శిశు సంక్షేమ శాఖ పెళ్లి పిలుపు' అందుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఫంక్షన్‌హాల్‌కు తరలివచ్చి వధూవరులను మనసారా ఆశీర్వదించారు. అధికారులంతా కలిసి దుస్తులు, వస్తు సామగ్రితోపాటు బంగారం కొనుగోలు చేసి ఇచ్చారు. గాయత్రి షుగర్స్ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావ్ తన సతీమణి వీణ ద్వారా వధువుకు దుస్తులు, నగదు అందించారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తోపాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా సంక్షేమాధికారి రమ్య తదితరులున్నారు.

డీఈ వేధింపులకు ఉద్యోగులు బలి

- ఏజెంట్ వ్యవస్థతో నిరంతరం నిఘా
- మెమోలు, షోకాజ్‌లతో హంగామా
- ఇప్పటికే దీర్ఘకాలిక సెలవులో ఏడీఈ
- విధుల్లో భయంభయంగా మరికొందరు

నిజామాబాద్‌నాగారం : తనకు నచ్చినట్లుగా లేకుంటే ఆ అధికారికి నచ్చదు.. తన ఏజెంట్ వ్యవస్థతో ఉద్యోగుల చిన్నచిన్న తప్పిదాలను భూతద్దంలో చూపిస్తూ షోకాజ్ నోటీసులిస్తూ అందికకాడికి దండుకుంటున్న విద్యుత్‌శాఖలోని ఆర్మూర్ డీఈ లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తనకు నమ్మిన బంటులతో డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలపై నిఘా పెట్టి వారికి షోకాజ్ నోటీసులు, మెమోలూ ఇస్తూ ముడుపుల బాగోతానికి తెరలేపిన ఈ డీఈ దగ్గర పనిచేయడానికి కూడా ఉద్యోగులు భయపడే పరిస్థితి తయారైంది.

వివరాల్లోకి వెళ్తే..

జిల్లాలో 2018 మే నెలలో ఆంధ్రాకు చెందిన ఏడీఈ బోధన్ పట్టణంలో విధుల్లో చేరారు. సెక్షన్లు ఇవ్వకుండా కేవలం ఆఫీస్‌లోనే పోస్టింగ్ ఇచ్చారు. అయితే సదరు ఏడీఈ ఆఫీసులో లేని సమయాన్ని ఏజెంట్ వ్యవస్థతో ప్రత్యేకంగా నిఘా పెట్టించారు. ఆయన లేని సమయంలో డీఈ ఆఫీస్‌కు వచ్చి పరిశీలించి మెమోలు ఇస్తూ వచ్చారు. ఇలా ప్రతి చిన్న విషయానికి సదరు ఏడీఈకి సుమారు 8 నుంచి 10 వరకు మెమోలు ఇచ్చినట్లు సమాచారం. ముడుపులు ఇస్తే ఇక్కడే మెమోలు రద్దవుతాయి. లేకుంటే పైఅధికారులకు డీఈ ఏడీఈ మెమోలను రిఫర్ చేయడం జరిగేది. 2020 జూన్ నెలలో బదిలీపై ఆర్మూర్ డివిజన్‌కు ఏడీఈ వెళ్లారు. రెండేళ్ల పాటు ఆర్మూర్ డివిజన్‌లో మోర్తాడ్ ఏడీఈగా విధులు నిర్వహించారు. అయితే బోధన్ డివిజన్‌కు చెందిన డీఈ బదిలీపై 2022 అక్టోబర్‌లో ఆర్మూర్ డివిజన్‌కు వచ్చారు. సదరు డీఈ వస్తున్న విషయం ముందే తెలుసుకున్న ఏడీఈ 2022 సెప్టెంబర్‌లో దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లారు.

ఇక్కడే ఉంటే మళ్లీ వేధింపులకు గురి చేస్తాడని భయపడి సుమారు 250 రోజుల పాటు సెలవు పెట్టారు. సెలవుల్లోనే నానాతిప్పలు పడి కామారెడ్డిలోని ఎంఆర్‌టీ సెక్షన్‌లో ఏడీఈగా ఈ ఏడాది జూన్‌నెలలో విధుల్లో చేరారు. ఇలా ఉద్యోగులను వేధిస్తుండడంతో ఆయన ఎక్కడ ఉండే అక్కడ ఉద్యోగులు భయంభయంగానే విధులు నిర్వహిస్తున్నారని సమాచారం.

బీజేపీ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- లోనికి చొచ్చుకెళ్లేందుకు నేతల యత్నం
- నాయకులు, పోలీసుల మధ్య తోపులాట
- ముట్టడి భగ్నం చేసేందుకు పకడ్బందీ బందోబస్తు
- జిల్లా అధ్యక్షుడు, ఫ్లోర్‌లీడర్ గృహ నిర్బంధం



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సుభాష్‌నగర్ : టీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు దళితులకు మూడెకరాల భూమి, రైతులకు ఇస్తానన హామీలు అమల్జేయకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు గృహ నిర్బంధాలు, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో బందోబస్తు చేపట్టినప్పటికీ లోపలికి చొచ్చుకెళ్లేందుకు నేతలు విఫల యత్నం చేశారు. నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, కులాచారి దినేష్, కార్పొరేటర్లు, నాయకులు లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, తదితరులను అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డిని గృహనిర్బంధం చేశారు. అదనపు డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు నరహరి, వెంకట నారాయణ, సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. భారీ ఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేసి కట్టుదిట్టం చేశారు. అయినప్పటికీ బీజేపీ నాయకులు ఒక్కసారిగా నలుమూలల నుంచి రావడంతో పోలీసులు ఎక్కడికక్కడే వారిన అడ్డుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు.



కులాచారి దినేష్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

విజయవంతం..

బీజేపీ నాయకులు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది. మొదట బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దినేష్ కులాచారి, రూరల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. వారిని అదుపులోకి తీసుకునేలోపే వివిధ కాలనీలు, చెట్ల పొదల్లో నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు కలెక్టరేట్ లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. నాయకులు న్యాలం రాజు, స్వామి యాదవ్, శివప్రసాద్, రోషన్, దొంతుల రవి, తదితరులు గేట్ వద్దకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. వారిని అదుపు చేయడానికి పోలీసులు ముప్పుతిప్పలు పడ్డారు.

హామీలు అమలు చేయకపోతే ఉద్యమాలే..

బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమాలు చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. హామీలు అమల్జేయాలని కోరితే అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ఖండించారు. రైతాంగాన్ని మోసం చేస్తున్నారని, రూ.లక్ష రుణమాఫీ, ఉచితంగా ఎరువులు, తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు, తదితర హామీలు ఏమయ్యాయన్నారు. అరెస్టులకు బీజేపీ కార్యకర్తలు భయపడే పరిస్థితుల్లో లేరని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, దొంతుల రవి, శివప్రసాద్, రోషన్, వినోద్, హరీష్‌రెడ్డి, మీసేవ శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, నాయిడి రాజన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

నోటరీ భూములను రెగ్యులరైజ్ చేసుకోవాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

సుభాష్‌నగర్ : నోటరీ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని, అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా కేవలం నోటరీ ద్వారా భూములు కొనుగోలు చేసిన వారందరికి అవగాహన కల్పించేలా చూడాలన్నారు. హరితహారం, బీసీలు, మైనార్టీలకు ఆర్థిక సహాయం, దళిత బంధు, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, నివేశన స్థలాల అందజేత, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై సీఎస్ శాంతికుమారి సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవో నం. 84ను అనుసరిస్తూ 125 గజాల లోపు నోటరీ ప్లాట్లకు ఉచితంగానే రెగ్యులరైజ్ చేస్తామని, 125 గజాలు దాటిన వారికి స్టాంప్ డ్యూటీ, రూ. 5 పెనాల్టీ వర్తిస్తుందన్నారు. ఈ విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, అన్ని మున్సిపాలిటీల్లో ప్రచారం చేయిస్తున్నామన్నారు. మీ–సేవ కేంద్రాల నిర్వాహకులకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబర్ 15లోగా జిల్లాలకు కేటాయించిన హరితహారం పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 47.90 లక్షల మొక్కలు నాటి హరితహారం లక్ష్యాన్ని వంద శాతం పూర్తిచేశామన్నారు. వృద్ధాప్య, ఆసరా పింఛన్‌దారులు మరణించిన పక్షంలో వారి భాగస్వామికి పెన్షన్ బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఆసరా పింఛన్ దరఖాస్తులను మూడు రోజుల్లో మంజూరు చేయాలని ఆమె ఆదేశించారు. బీసీ కులవృత్తుల కింద రూ.లక్ష ఆర్థికసాయం రెండో దశ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీని వేగవంతం చేస్తూ నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు యాదిరెడ్డి, చిత్రామిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

ఐఎంబీఏ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలో సోమవారం ఐఎంబీఏ 2వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రారంభమైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఈ పరీక్షలకు 27 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

ఆలిండియా క్యారం సంఘం గౌరవ ఉపాధ్యక్షుడిగా సంతోష్



నిజామాబాద్‌నాగారం: ఆలిండియా క్యారం సంఘం గౌరవ ఉపాధ్యక్షుడిగా క్యారం సంఘం జిల్లా అధ్యక్షుడు, నవ్య భారతి గ్లోబల్ పాఠశాల చైర్మన్ క్యాతం సంతోష్ కుమార్ హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నగరంలోని నవ్య భారతి గ్లోబల్ పాఠశాలలో ఐపీఎల్ 20-20 మాదిరిగా అంతర్జాతీయ స్థాయిలో డెక్కన్ ప్రీమియర్ క్యారం లీగ్ సీజన్-2 సంతోష్ కుమార్ నిర్వహించారు. అనంతరం సంతోష్‌ను రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మంతెన రాజేందర్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈగ సంజీవరెడ్డి, బొబ్బిలి నర్సయ్య, జిల్లా క్యారం సంఘం కార్యదర్శి భూమారెడ్డి, పేట సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, సభ్యులు రాజేందర్, మొయిజ్, అబ్దుల్, సూరి అభినందించారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై ఫిర్యాదు

తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలో యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిబంధనలు పాటించని అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాదల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కొన్ని చోట్ల ఒకే భవనంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు, మరికొన్ని చోట్ల డిగ్రీ, పీజీ కళాశాలలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, తరగతి గదులు, బోధనా సిబ్బంది లేకుండానే కళాశాలలు నడుపుతున్నారని అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అనుబంధ కళాశాలల నుంచి కామన్ సర్వీసెస్ ఫీజు వసూలు చేసి వర్సిటీ అభివృద్ధికి వినియోగించాలన్నారు. అనంతరం వర్సిటీ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం టీయూ అధ్యక్షుడు శ్రీకాంత్, శివకుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయడం ప్రమాదకరమని డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి అన్నారు. సోమవారం బేగంపూర్ చౌరస్తాలో ఎస్సై కోనారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమాల గురించి ద్విచక్ర వాహనదారులకు డీఎస్పీ అవగాహన కల్పించారు. అనంతరం హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లను పంపిణీ చేశారు. ఎస్ఎస్ఎస్ షాపింగ్ మాల్ యజమాని శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, చిల్లర్గి రాజు, కాస్లాబాద్ శ్రీనివాస్‌ల సహాయంలో హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించామని ఎస్సై కోనా రెడ్డి తెలిపారు. సీఐ కృష్ణ, పోలీస్ సిబ్బంది గోరి, రవి పాల్గొన్నారు.

ఆ బాధ్యత మాకొద్దు..

- మత్స్య అభివృద్ధి అధికారిగా రావడానికి జంకుతున్న వైనం
- ఏడీనే ఇన్‌చార్జి అధికారి

బాల్కొండ: ఎస్సారెస్పీ జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో మత్స్య అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహించేందుకు అధికారులు జంకుతున్నారు. అరకొర వసతులు, శిథిలావస్థలో హెచరీలు ఉండడం, మట్టిపాండ్లల్లో పిచ్చిమొక్కలు పెరిగి పనికి రాకుండా మారడం ఇన్ని సమస్యల మధ్య చేపపిల్లల ఉత్పత్తి చేపట్టి విధులు నిర్వహించడం కత్తి మీద సాములాంటిదని వారు పేర్కొంటున్నారు. ఫలితంగా అధికారులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తున్నదని బాధ్యతలు తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం అభివృద్ధి అధికారిగా ఏడీ రాజనర్సయ్య గత ఏడాది నుంచి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఆరు నెలల క్రితం మత్స్య అభివృద్ధి అధికారిగా డోలిసింగ్ బాధ్యతలు చేపట్టారు. కానీ చేపపిల్లల ఉత్పత్తిపై, మట్టి పాండ్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో మరో అధికారి లాయక్ మొహినొద్దీన్‌ను ప్రభుత్వం నియమించింది. వారం తిరగకముందే సెలవుపై వెళ్లారు. మళ్లీ ఆ పోస్టు ఖాళీ అవడంతో ప్రస్తుత నిజామబాద్ ఏడీగా విధులు నిర్వహిస్తున్న రాజనర్సయ్య ఎస్సారెస్పీ చేప పిల్లల కేంద్రంలో ఎఫ్‌డీవోగా కొన్నేళ్ల పాటు విధులు నిర్వహించారు. ఈ అనుభవంతో ఇన్‌చార్జి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ప్రస్తుతం ప్రభుత్వం చెరువుల్లో చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఎస్సారెస్పీ చేపపిల్లల కేంద్రం నుంచి మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లలను పంపిణీ చేయాల్సి ఉంటుంది. దీంతో పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో స్థానిక మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి పూర్తిస్థాయి అధికారిని నియమించేలా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పోచంపాడ్‌లోని మత్స్యఅభివృద్ధి అధికారి కార్యాలయం

ప్రజా సంక్షేమానికి కృషి



ఎత్తొండ వంతెనను ప్రారంభిస్తున్న స్పీకర్

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో పలు అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. సభ ప్రాంగణంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 41,500 మందికి ఆసరా పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, బీడీ పింఛన్, పలు పథకాలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, హౌసింగ్ డీఈ నాగేశ్వరరావు, జడ్పీటీసీ శంకర్ పటేల్, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, బాన్సువాడ సెగ్మెంట్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, సర్పంచ్ సాయిబాబా, విండో చైర్మన్ అశోక్ పటేల్ పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 132 ఫిర్యాదులు

సుభాష్‌నగర్: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో 132 మంది ఫిర్యాదు చేశారు.

కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీపీవో జయసుధ ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పాస్ లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలి

నగరంలోని పోస్ట్‌మెట్రిక్ సంక్షేమ హాస్టళ్లలో ఈ-పాస్ లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. అడ్మిషన్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు ఈ-పాస్‌తో సంబంధం లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలని కోరారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలోని ధర్నా చౌక్‌లో బతుకమ్మలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు జరిపినా స్పందించడం లేదన్నారు. సరీ్వసులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు పుష్ప, గంగాజమున, సరోజ, కవిత, ప్రమీల, జ్యోతి, రజిత, అనురాధ, అమృత, విజయ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



మోర్తాడ్: సిద్దిపేట్‌లో నిర్వహించిన తెలంగాణ జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ రెండో రాష్ట్ర స్థాయి పోటీల్లో మోర్తాడ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని శిక్షకుడు అవినాశ్ సోమవారం తెలిపారు. కరాటేలో శ్రీనిధి, శ్రీకృతి బంగారు పతకాలు సాధించగా మనుకృతి, రిత్వేశ్‌లు వెండి పతకాలు సాధించారు. వీరిని రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు పాషా, టోర్నమెంట్ ఆర్గనైజర్ అహ్మద్ అభినందించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ శివాని తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ అభివృద్ధే లక్ష్యం



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్ : ఆర్మూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను పేదల కోసం తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను మళ్లీ ఆశీర్వ దించాలన్నారు. పెర్కిట్ బస్టాండ్ సమీపంలో రూ. 11.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు, రూ. 3 లక్షలతో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌కు, రూ. 8 లక్షలతో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌కు, రూ. 3 లక్షలతో రజక సంఘం కమ్యూనిటీ హాల్‌కు, రూ. 3 లక్షలతో గుండ్ల సంఘం కమ్యూనిటీ హాల్‌కు, రూ. 5 లక్షలతో వీడీసీ కమ్యూనిటీ హాల్‌కు, రూ. 6 లక్షలతో గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌కు, రూ. 3లక్షలతో రజక సంఘం-2 కమ్యూనిటీ హాల్‌కు, రూ. 5 లక్షలతో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌కు, రూ. 5 లక్షల మాల సంఘం కమ్యూనిటీ హాల్‌కు, 3 లక్షలతో దేవాంగ కమ్యూనిటీ హాల్‌కు భూమి చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, ఏఈ రమేష్, కౌన్సిలర్‌లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో 93 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 93 వినతులు వచ్చాయి. వాటిలో భూ సమస్యలు, ధరణి, భూ తగాదాలకు సంబంధించి 56 వినతులు ఉన్నాయి. మిగితావి ఆయా శాఖలకు చెందిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యలు, ధరణికి సంబంధించి ఎక్కువగా వినతులు వస్తున్నాయని అన్నారు.

తహసీల్దార్లు సాధ్యమైనంత వరకు తమ స్థాయిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన అనంతరం ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, కలెక్టరేట్ ఏవో మసూద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే దళితబంధు ఇవ్వాలి

దళిత బంధు పథకం అర్హులకే కేటాయించాలని కోరుతూ దోమకొండకు చెందిన దాదాపు 100 మంది దళితులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. అనర్హులకు, ప్రజాప్రతినిధుల అనుచరులకు మాత్రమే దళిత బంధు ఇస్తున్నారని ఆరోపించారు. అర్హులైన వారికి ఇవ్వడం లేదన్నారు. అధికారులు స్పందించి అర్హులైన వారికి దళిత బంధు పథకం అందించాలని కోరారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్

అటవీ శాఖ అధికారుల అత్యుత్సాహం

- పట్టాభూమిలో మొక్కలు నాటడానికి యత్నం
- పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రైతు
- పరిస్థితి విషమం

లింగంపేట(ఎల్లారెడ్డి): అటవీశాఖ అధికారులు ఓ రైతుకు సంబంధించి వారసత్వంగా వచ్చిన పట్టాభూమిలో అత్యుత్సాహంతో మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. ఇదేంటని ప్రశ్నించిన ఆ రైతుపై బెదిరింపులకు పాల్పడ్డారు. అధికారుల దౌర్జన్యంతో విసిగిపోయిన రైతు ఆత్మహత్యకు యత్నించిన ఘటన ముంబోజీపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ తండ్రి మారుతి పేరుపై గ్రామ శివారులోని సర్వే నంబరు 99లో రెండు ఎకరాల ఇరవై గుంటల భూమి ఉంది. విజయ్‌కుమార్ తండ్రి నుంచి వారసత్వంగా పట్టా పాస్‌బుక్ భార్య కలవ్వకు వచ్చింది. 50 ఏండ్లుగా వీరు భూమిలో పంటలు సాగు చేసుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకోనివ్వకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బాధితుడు తనకు న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశాడు. సర్వే అధికారి అంబర్‌సింగ్ గ్రామానికి సోమవారం చేరుకొని అటవీశాఖ అధికారులు, సర్పంచ్ గురప్రు స్వప్న సమక్షంలో సర్వే చేపట్టారు. వారం రోజుల్లో సర్వేయర్ నివేదిక రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు అందజేస్తామన్నారు. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు సదరు భూమిలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతామని గ్రామస్తులు, అధికారుల ముందు చెప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రైతు విజయ్‌కుమార్ అందరు చూస్తుండగానే పురుగు మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. విజయ్‌కుమార్ వదిన భాగ్యలక్ష్మి అక్కడే ఒంటిపై పెట్రోలు పోసుకోవడానికి యత్నించడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. రెండు నెలలుగా అటవీ శాఖ అధికారుల వేదింపులు తాళలేక ఇద్దరు ఆత్మహత్యకు యత్నించడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అటవీ శాఖ అధికారుల జులూమ్‌పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ్‌కుమార్‌ను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. విజయ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తన భర్తను అధికారులు ఫిరోజ్‌ఖాన్, పృథ్వీరాజ్, వినోద్, ఎఫ్ఆర్‌వో ఓంకార్ రెండు నెలలుగా వేధిస్తున్నారని విజయ్ భార్య కావ్య ఆవేదన వ్యక్తం చేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



కొత్త పట్టా పాసు పుస్తకం

రైతులను వేధించలేదు

తాము రైతులను వేధింపులకు గురిచేయలేదు. సర్వే నివేదిక వచ్చిన తర్వాత ఏది తేలితే దానికి కట్టుబడి ఉంటాం. అటవీ శాఖ భూమి అని తేలితే మొక్కలు నాటుతాం.

– ఓంకార్, ఎఫ్ఆర్‌వో

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

బాల్కొండ: మెండోరా మండలంలోని సావెల్ గ్రామానికి చెందిన రైతు నాగన్న (50) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నా యి. నాగన్న తన పంట పొలాల్లో నీటి సరఫరాకు స్థానిక బొబ్బెర చెరువులో ఏర్పాటు చేసిన పంపు సెట్‌ను తీస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. నాగన్నకు తోడుగా వెళ్లిన గాండ్లచిన్నయ్య విషయాన్ని గ్రహించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

మోపాల్: గుడితండాలో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు. గ్రామాల్లో రోడ్డు విస్తీర్ణంలో భాగంగా ఒక వర్గం వారు రోడ్డు తమదంటూ వాదనకు దిగారు. దీంతో మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దాడిలో తండాకు చెందిన గోపాల్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భీమ్‌గల్: మండల కేంద్రంలోని రాజారాంనగర్ కాలనీలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో దుర్వాసన ఎక్కువగా వస్తుండడంతో కాలనీవాసులు చుట్టుపక్కల వెతుకగా చెట్లపొదల్లో మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 30 సంవత్సరాల వరకు ఉంటుందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్ మంజీరా నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ భరత్ సోమవారం తెలిపారు. ఇసుకను తరలిస్తున్నారన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సోమవారం తెల్లవారు జామున మూడు ఇసుకట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ట్రాక్టర్ యజమానులపై క్రిమినల్ కేసునమోదు చేస్తామని హెచ్చరించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా భిక్కనూర్‌కు చెందిన నాగరాజు, కాచాపూర్‌కు చెందిన సుధాకర్, అశోక్‌నగర్ కాలనీకి చెందిన సాయినాథ్‌లు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని సోమవారం కోర్టుకు హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

గుండెపోటుతో పశువైద్యాధికారి మృతి

బోధన్‌రూరల్(బోధన్): ఉమ్మడి బోధన్ మండల పశువైద్యాధికారి ఖలీంబేగ్ (52) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో ఉన్న తన నివాస గృహంలో గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది ఆయన భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.



ఖలీం బేగ్ (ఫైల్)

బ్రెయిన్ ట్యూమర్‌తో ఆర్మీ జవాన్ మృతి



ప్రశాంత్(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లికి చెందిన ఆర్మీ జవాన్ ప్రశాంత్(28) కోల్‌కతాలో బ్రెయిన్ ట్యూమర్‌తో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దేశం మీద భక్తితో ఆర్మీలో చేరిన ప్రశాంత్ అస్సాంలో భారత సైన్యానికి సేవలందిస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చిన ప్రశాంత్ తలనొప్పిగా ఉందంటూ హైదరాబాద్‌లోని ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నట్లు తెలిపారు. దీంతో కోల్‌కతాలోని ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. భర్త మృతిని తెలుసుకున్న భార్య సుఖన్య స్పృహ తప్పిపడిపోయింది. స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రశాంత్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ప్రశాంత్‌కు భార్య, నాలుగు నెలల కుమారుడు ఉన్నారు. మంగళవారం స్వగ్రామానికి మృతదేహం చేరనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



ప్రశాంత్ ఇంటివద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆటో బోల్తా: పలువురికి తీవ్ర గాయాలు

లింగంపేట (ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మూల మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైనట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గాంధారి వైపు నుంచి లింగంపేట వైపు వస్తుండగా మూల మలుపు వద్ద ఆటో అదుపుతప్పి రోడ్డు కింద బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న బక్క రాములు, మాదయ్య, ముదాం మంజులకు తీవ్రగాయాలు కాగా చిన్నారులు సందీప్, హర్ష, డ్రైవర్ బానోత్ భరత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108లో కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై రాము తెలిపారు. ధర్పల్లి నుంచి మోపాల్‌వైపు వస్తున్న డీసీఎం కులాస్‌పూర్‌లో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నది. ఘటనలో బైక్ నడుపుతున్న శేఖర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. శేఖర్ భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఘటన స్థలంలో క్షతగాత్రులు

భర్తను చంపిన భార్య

- నగరంలో దారుణ ఘటన
- పోలీసుల అదుపులో నిందితులు



దానవమైన కృష్ణ మృతదేహం

నిజామాబాద్‌రూరల్: భర్త పెడుతున్న బాధలను తట్టుకోలేక భార్య తన తల్లిదండ్రులతో కలిసి గొడ్డలితో నరికి చంపిన ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. సౌత్ రూరల్ సీఐ వెంకటరమణ, రూరల్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్ కాలనీకి చెందిన కృష్ణ (31) అదే కాలనీకి చెందిన గంగతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. కృష్ణ తరచూ భార్య గంగ, అత్త, మామలతో గొడవ పడేవాడు. ఇదే క్రమంలో సోమవారం సాయంత్రం కృష్ణ అత్తగారింటికి వెళ్లి భార్యతో గొడవ పడ్డాడు. దీంతో విసిగిపోయిన భార్య గంగ, మామ గంగమురళి, అత్త సత్తమ్మ అల్లుడు కృష్ణను గొడ్డలితో నరికి హత్య చేశారు. మొదట కళ్లలో కారంపొడి చల్లి గొడ్డలితో దాడి చేశారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకట్‌నారాయణ, ఎస్సై మహేశ్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు కృష్ణ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.